

'గృహలక్ష్మి' నిరంతర ప్రక్రియ

గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, అర్హులు అధైర్య పడొద్దని మంత్రి సబితారెడ్డి భరోసా ఇచ్చారు. 8లో▸



కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

రెస్టారెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు షాబాద్‌లో మంత్రి పర్యటన



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: మండలంలో మంగళవారం మంత్రి మహేందర్‌రెడ్డి పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు కొమరబండ గ్రామ పరిధిలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.అనంతరం సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.మంత్రితో పాటు చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు ఏశాల చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌ను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


నేడు జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు

మొయినాబాద్ రూరల్: మండలంలోని అజీజ్ నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం రాజేంద్రనగర్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ జోనల్ కార్యదర్శి బాలస్వామిరెడ్డి తెలిపారు. మొయినాబాద్, రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 14 నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వారి వారి పాఠశాలల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

రేపు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లాటరీ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలోని శేర్‌లింగంపల్లి, ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని రెండు వేల మంది లబ్ధిదారులకు ఈ నెల 30న డబుల్ బెడ్‌రూం ఇళ్లను లాటరీ పద్ధతిన కేటాయించనున్నట్లు కలెక్టర్ హరీష్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో లాటరీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు తెలిపారు. మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నియోజకవర్గాల నుంచి మొత్తం 93,899 దరఖాస్తులు అందగా, వీటిలో 12,479 మంది అర్హత సాధించగా, వీరిలో మొదటి విడతగా నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 2వేల మంది లబ్ధిదారులకు ఆయా ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇళ్లను అందజేయనున్నట్లు ప్రకటించారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు దీపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రోఫీ అందుకుంటున్న దీపిక

మొయినాబాద్ రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి 8వ జూనియర్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో చేవెళ్ల గురుకుల విద్యార్థిని బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని దీపిక 44 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఎండలు మండే!



వేసవిని తలపిస్తున్న వానాకాలం

- మండుతున్న ఎండలు.. ఉక్కపోత
- గ్రేటర్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్
- తాజాగా సోమవారం 3,159 మెగావాట్ల నమోదు
- రంగారెడ్డి జిల్లా పరిధిలోనే అత్యధిక వినియోగం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వానాకాలంలో ఎండలు భగ్గుమంటున్నాయి. గత నెలలో కురిసిన ఏకధాటి వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడం, భానుడు ఉగ్రరూపం దాల్చడంతో వాతావరణంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎండలు జిల్లా వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఎక్కువగా వాడుతున్నారు. ఫలితంగా ఇంట్లో కరెంట్ మీటరు గిర్రున తిరుగుతూ నెలవారి బిల్లులు.. మార్చి, ఏప్రిల్, మే మాసాలను తలపిస్తున్నాయి. తాజాగా సోమవారం గరిష్టంగా 32.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కనిష్టంగా 23.1 డిగ్రీలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలకు తోడు విద్యుత్ డిమాండ్ కూడా రికార్డు స్థాయిలో 3,159 మెగావాట్లు నమోదైంది. గత ఏడాది ఇదే రోజు 2,350 మెగావాట్లు నమోదు కాగా, ఈ సారి ఏకంగా 800 మెగావాట్లకు పైగా నమోదవడం విశేషం. వర్షాకాలంలోనూ విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో తరచూ ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

పరిశ్రమలకు ధీటుగా గృహ వినియోగం

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 59 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 49లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు, ఏడున్నర లక్షల వాణిజ్య కనెక్షన్లు, 50 వేలకుపైగా పారిశ్రామిక కనెక్షన్లు ఉన్నట్లు అంచనా. సాధారణంగా వర్షకాలంలో ఎండలు తక్కువగా ఉంటాయి. ఉక్కపోత కూడా అంతగా ఉండదు. విద్యుత్ వినియోగం కూడా చాలా తక్కువగా ఉంటుంది. వాతావరణ మార్పుల కారణంగా ప్రస్తుతం రోజుకు సగటున 60 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం నమోదవుతోంది. ఇందులో పరిశ్రమలు, వాణిజ్య అవసరాలకు 30 మిలియన్ యూనిట్లు ఖర్చు అవుతుండగా, కేవలం గృహ అవసరాలకే 30 ఎంయూలకుపైగా రికార్డు అవుతుండడం విశేషం. పగలు, రాత్రి తేడా లేకుండా గత వారం రోజుల నుంచి భారీగా విద్యుత్ డిమాండ్ నమోదవుతుండడం, ఫీడర్లు ఒత్తిడికి గురై.. తరచూ ట్రిప్పవుతుండడం, సరఫరాలో అంతరాయాలు తలెత్తుతుండడంపై సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఓఆర్‌ఆర్‌కు అవతలి వైపు ఉన్న మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

గ్రేటర్ జిల్లాల్లో రోజువారి విద్యుత్ డిమాండ్ ఇలా..

తేదీ	మెగావాట్లు
22	3,060
23	3,198
24	3,152
25	3,190
26	3,043
27	3,045
28	3,159

ఉక్కపోత.. దోమల మోత

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇంటి చుట్టూ మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఉక్కపోతకు తోడు దోమలు గ్రేటర్ వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమ కాటుతో శరీరంపై దద్దుర్లు ఏర్పడి స్కిన్ ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయి. అంతేకాకుండా డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. సాధారణ ప్రజలతోపాటు వైద్యులు సైతం డెంగీ జ్వరాల బారిన పడుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఓ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సైతం ప్రస్తుతం డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

జిల్లాలో కొత్త నిర్మాణాలతో పాటు వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా ఉన్న మున్సిపాలిటీల్లో కొత్త కనెక్షన్ల సంఖ్య అనూహ్యంగా పెరిగాయి. అదే స్థాయిలో విద్యుత్ వినియోగం కూడా నమోదవుతోంది. జిల్లాలోని సైబర్ సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలో 1,17,417 వ్యవసాయ, 15,98,206 గృహ, 2,38,874 వాణిజ్య, 15,333 పారిశ్రామిక, 12,364 వీధి దీపాలు, 5,238 వాటర్ వర్క్స్, 9,834 ఇతర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పారిశ్రామిక కనెక్షన్లకు తోడు వ్యవసాయ కనెక్షన్లు కూడా ఇక్కడే ఎక్కువగా ఉండడంతో జిల్లాలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతోంది. గ్రేటర్ పరిధిలో గత వారం రోజుల నుంచి రోజుకు సగటున 3వేల మెగావాట్లకు పైగా డిమాండ్ నమోదవుతుండగా, ఇందులో ఒక్క రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 1,200 నుంచి 1,500 మెగావాట్ల వరకు రికార్డు అవుతుండడం విశేషం. ఫలితంగా శివారు మండలాల్లో అనధికారిక విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. నందిగామ, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, చేవెళ్ల తదితర ప్రాంతాల్లోని రైతులు విద్యుత్ సరఫరా కోసం ఆందోళనలకు సైతం దిగుతుండడం గమనార్హం.



ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు

బోనాలకు ఏర్పాట్లు చేయండి

- మంత్రి సబితారెడ్డి
- సెప్టెంబర్ 4, 5 తేదీల్లో సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు
- ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తుక్కుగూడ: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ 40వ వార్షికోత్సవం, కల్యాణ వేడుక, బోనాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆమె పాలకమండలి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయాలు మంజూరు చేసిందని తెలిపారు. ఆ నిధులతో ఆలయాల అభివృద్ధి, భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4, 5వ తేదీల్లో సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పాలకమండలి సభ్యులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు జ్యోతి, నాగేశ్వర్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, కౌన్సిలర్ సుమన్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జిల్లాల లక్ష్మయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సన్నాహాలు షురూ

- డీసీపీలతో సమీక్ష నిర్వహించిన కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర అసెంబ్లీకి సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో నగర పోలీసు విభాగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటులేకుండా స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగిన ఈ మీటింగ్‌లో డీసీపీ ఆపై స్థాయి అధికారులు పాల్గొన్నారు. నగర పోలీసులు ప్రధానంగా నిర్మానుష్య, సమస్యాత్మక ప్రాంతాల మ్యాపింగ్, సున్నితమైన పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, వివిధ విభాగాలతో కలిసి ఉమ్మడి తనిఖీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు తదితర అంశాలు చర్చించారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేసేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వెనుకాడవద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మెహిదీపట్నం సర్కిల్‌లోని పలు కాలనీల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనుల పరిశీలన సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు కనిపించడంతో ఈ మేరకు ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లు, నాలాలు, చెరువులు తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు వేసేవారికి జరిమానా విధించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం నోరు మెదపరేం?



చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఈటల రాజేందర్ తదితరులు

- వీరజవాన్ చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన ఈటల రాజేందర్
- కేంద్రం తరఫున సాయం చేస్తామని హామీ

కొందుర్గు: దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోతున్న వీర జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక పాలసీని ఏర్పాటు చేయాలని బీజేపీ తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలోని తిరమలదేవునిపల్లిని సందర్శించి ఇటీవల మృతిచెందిన వీర జవాన్ చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కొన్ని సందర్భాల్లో వెంటనే స్పందించి ఊహించని విధంగా హామీలు ఇస్తారని, అయితే వీర జవాన్ చంద్రశేఖర్ విషయంలో ఎలాంటి హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దేశం అబ్బురపడేలా వీర జవాన్ల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పిన కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. చంద్రశేఖర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తరఫున చంద్రశేఖర్ కుటుంబానికి అన్ని సదుపాయాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, శంకర్, శివారెడ్డి, శ్రీశైలం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులు స్ఫూర్తి ప్రదాతలు



రావుపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి

- వారి పోరాట పటిమను భవిష్యత్ తరాలకు అందించాలి
- మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి
- రావుపల్లిలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ
- మల్లారెడ్డిగూడ, రావుపల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

చేవెళ్ల: మహనీయులు స్ఫూర్తి ప్రదాతలని, వారు చూపిన బాటలో నడుద్దామని మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం రావుపల్లిలో సర్పంచ్ శ్రీనివాస్ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్, మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్‌ల విగ్రహాలను సోమవారం వారు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ. 10లక్షలతో నిర్మించిన ఓపెన్ డ్రైనేజీని, రూ. 45లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ. 12.60లక్షలతో నిర్మించిన వైకుంఠధామన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. మల్లారెడ్డిగూడలో రూ. 20 లక్షలతో నిర్మించిన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను, సీసీ రోడ్లను ప్రారంభించారు. రావుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడారు. గ్రామంలో ఒకే సారి ఐదుమంది మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. వారి పోరాట పటిమను భవిష్యత్ తరాలకు అందించాలి సూచించారు. నియోజకవర్గంలో స్వర్గీయ ఇంద్రారెడ్డి చెరగని ముద్ర వేశారని, ఏ గ్రామానికి వెళ్లినా ఆయన పేరు వినిపిస్తోందన్నారు. షాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలన్నారు. ఆయన్ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆదరించి మూడోసారి గెలిపించాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మహిళా సంఘాలకు అభయహస్తం నిధులు వారం రోజుల్లో విడుదలవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పీ కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు రవీందర్, స్వరూప, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచులు రాంచంద్రయ్య, హన్మంత్‌రెడ్డి, బుచ్చయ్య, నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

చేవెళ్లలో రూ. 1. 80 కోట్ల వ్యయంతో అధునాతన గ్రంథాలయ భవన నిర్మాణానికి, అలాగే సింగప్పగూడలో పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాయల సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. తెలంగాణ తరహా పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీనే గెలిపిస్తామని సింగప్పగూడ ప్రజలు తీర్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, ఈఈ కుమార్‌గౌడ్, ఎంపీడీ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'తీగ జాతి'కి తెగుళ్ల బెడద

- సస్యరక్షణ చర్యలతో నివారణ
- బీర, కాకర, సొరకాయలకు మార్కెట్‌లో స్థిరమైన ధర
- సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- ఉద్యాన శాఖ సీనియర్ శాస్త్రవేత్త శ్రీకృష్ణ సూచనలు





సూక్ష్మపోషకాల లోపంతో ఉన్న బీర పంట, బీరలో బూజు తెగులు



కందుకూరు: తీగ జాతి కూరగాయల పంటలైన బీర, కాకర, సొర, దొండ మొదలైన పంటలకు మార్కెట్‌లో ఎప్పుడూ స్థిరమైన ధర ఉంటుంది. అందుకే రైతులు ఎక్కువగా ఈ తరహా పంటల సాగుకు మొగ్గు చూపుతుంటారు. ఇటీవల కాలంలో అనేక రకాల చీడపీడలు ఆశించి ఆ పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. తీగ జాతి పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన శాఖ సీనియర్ శాస్త్రవేత్త జీ శ్రీకృష్ణ రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

పండు ఈగ

తల్లి ఈగలు పూ మొగ్గలపైన, లేత పిందెలపైన గుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చిన సన్నని సులి పురుగులు కాయ తొలిచి లోపల గుజ్జును తిని నష్టపరుస్తాయి. ఈ పురుగు బీర, కాకర పంటలను ఎక్కువగా ఆశిస్తుంది. దీంతో కాయలు కుళ్లిపోతాయి.

నివారణ ఇలా..

ఎకరాకు సుమారు 6 - 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నివారణకు నోవల్యూరాన్ 1 మి.లీ. లేదా మలాథియాన్ 2.0 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వేప నూనె 10000 పీపీఎం 2 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ కూడా చేయవచ్చు.

పాము పొడ పురుగు

ఇది చాలా చిన్న గొంగళి పురుగులా సన్నగా ఉండి ఆకు పొరల్లో చొచ్చుకునిపోయి పత్రహరితాన్ని తిని నష్టపరుస్తుంది. నివారణకు థయోమిథాక్సిమ్ 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా డైమథోయేట్ 2 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బూజు తెగుళ్లు

ఆకు అడుగు భాగంలో బూజు మాదిరిగా ఏర్పడి ఊదా రంగుకు మారిపోతాయి. ఆకు పైభాగాన పసుపు రంగు మచ్చలు కనిపిస్తాయి. నివారణకు డైమిథోమాఫ్(అక్రోబాట్) 1 మి.లీ లేదా రెడోమిల్ ఎంజెడ్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

ఆకుల పైభాగంలో తెల్లని పొడిలా ఏర్పడి తెగుళ్లు ఎక్కువైనప్పుడు, పూతకు కూడా వ్యాపిస్తుంది. ఆకులు, కాండం ఎండిపోతాయి. నివారణకు డైనోకాప్(కెరాథేన్) 1 మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిలిన్ 1 మి.లీ లేదా డైఫెన్‌కోనజోల్ 1 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు

ఆకుల్లో ఈనెలుండే ప్రాంతంలో చారలు ఏర్పడతాయి. పాదు అంతా గిడసబారి, పూత తగ్గుతుంది. ఇలాంటి మొక్కలను వెంటనే గుర్తించి నాశనం చేయాలి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.

ఎండు తెగులు

తీగ, పూత, కాత సమయంలో నిలువునా ఎండిపోతాయి. నేల నుంచి బ్యాక్టీరియా ఆశించి ఎండు తెగులు వస్తుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి పాదులు తడిసేలా నేలలో పోయాలి.

వైరస్ తెగుళ్లు

తీగ జాతి కూరగాయల్లో వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఆశించి ఆకులు ముడుచుకుపోయి, పూత, పిందె రాకుండా గిడసబారినట్లు ఉంటాయి. వైరస్ వ్యాప్తి, రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగుల ద్వారా జరుగుతుంది. రసం పీల్చే పురుగుల నివారణకు థయోమిథాక్సిమ్ 0.3 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పసుపు, నీలం రంగు జిగురు పేపర్లు ఎకరాకు 10–20 వరకు పెట్టాలి. 10 రోజులకు ఒక్కసారి వేప నూనె 10000 పీపీఎం ను 2 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సూక్ష్మపోషకాల లోపంతో పిందెలు కుళ్లిపోతాయి. నివారణకు మ్యాక్స్ లేదా విపుల్ లేదా గ్రోత్‌ను 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మోతాదుకు మించి ఎక్కువ నీరు పెట్టడం లేదా సస్యరక్షణ కోసం మందులు అధికంగా వాడడం వల్ల పంటపై తీవ్ర ప్రభావం ఉంటుంది. అవసరానికి అనుగుణంగా సాగు పద్ధతులు పాటించాలి.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు



మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నక్కగుట్ట, తక్కళ్లపల్లి తండాలకు చెందిన గిరిజనులు

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ప్రజా సమస్యలపై పోరాడాలని శ్రేణులకు పిలుపు

యాచారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మాజీ ఎంపీపీ రమావత్ జ్యోతినాయక్ ఆధ్వర్యంలో సోమవారం నక్కగుట్టతండా, తక్కళ్లపల్లితండాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు సోమవారం ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల చూపు కాంగ్రెస్ వైపే ఉందన్నారు. ఈసారి బీఆర్ఎస్‌ను ఇంటికి పంపడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇక నుంచి నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను జనం నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నందు, రాజు, కిషన్, శేఖర్, వినోద్, హనుమంతు, రమేష్, గిరిబాబు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల భాస్కర్, నాయకులు అమృతాసాగర్, మోటె శ్రీశైలం, లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లకే నూరేళ్లు

- ఇంకుడు గుంతలో పడి చిన్నారి దుర్మరణం
- పద్మారంలో విషాదం



అక్కీ ఆనంద్ మృతదేహం

కొందుర్గు: ఇంకుడు గుంతలో పడి చిన్నారి మృతిచెందిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రగడ్డ జ్యోతి, గణేశ్ దంపతుల కుమారుడు అక్కీ ఆనంద్ (2) సోమవారం ఉదయం ఆడుకుంటూ వెళ్లి వీరి ఇంటి పక్కనే ఉన్న ఇంకుడు గుంతలో పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని బయటకు తీసి షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామానికి చెందిన దానగళ్ల వినోద్ గజంనర లోతు ఇంకుడు గుంత తవ్వి.. కప్పు వేయకుండా వదిలేశాడని స్థానికులు తెలిపారు. ఇందులో నీళ్లు నిల్వడంతోనే ప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ ఘటన అనంతరం పన్నెండేళ్ల మరో బాలుడు సైతం గుంతలో పడిపోయినప్పటికీ.. పెద్దవాడు కావడంతో పైకి ఎక్కాడని స్థానికులు తెలిపారు.

'గృహలక్ష్మి' నిరంతర ప్రక్రియ

- ఖాళీ జాగా ఉన్నవారికి రూ.3 లక్షల సహాయం
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: దబిల్‌గూడలో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తదితరులు

మహేశ్వరం: గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, అర్హులు ఎవరు కూడా అధైర్య పడొద్దు అండగా ఉంటామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మహేశ్వరం మండలం డబిల్‌గూడ, నాగారం, గొల్లూరులో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి రూ.2 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి, డబుల్ బెడ్ రూం ఇవ్వడంతో పాటు, ఇంటి వద్ద ఖాళీ జాగ ఉండి ఇంటి నిర్మాణం చేసుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని మంత్రి చెప్పారు.

17 లక్షల మందికి దళితబంధు

తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని మంత్రి పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పింఛన్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. పల్లెలు అభివృద్ధిలో పరుగులు తీస్తున్నాయని, రాష్ట్రంలో 17 లక్షల మంది దళిత కుటుంబాలకు దళితబంధు కింద రూ.10 లక్షలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారని ఆమె వెల్లడించారు. అంతకు ముందు డబిల్‌గూడలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన, నాగారం–పడమటి తండా వరకు బీటీరోడ్డు నిర్మాణం, గొల్లూరులో నూతన జీపీ భవనం, సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అర్హులకు పింఛన్ పత్రాలను అందజేశారు. వైస్ ఎంపీపీ సునితా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, డబిల్‌గూడ, నాగారం, పడమటి తండా, గొల్లూరు గ్రామ సర్పంచ్‌లు శంకర్, లావణ్య, అనితా నాయక్, కవిత, ఎంపీటీసీ సభ్యులు స్వప్న, వెంకటేశ్, నడికూడ రమేష్, ఉప సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కళాశాల భవనం ప్రారంభించాలి

చేవెళ్ల: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఏబీవీపీ నాయకులు మంత్రి సబితారెడ్డిని కోరారు. సోమవారం చేవెళ్ల మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకురాలు శిరీష మాట్లాడారు. కళాశాల నిర్మాణం మూడు సంవత్సరాలుగా కొనసాగుతునే ఉందని వాపోయారు. ఉన్న కళాశాలలో మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆమె చెప్పారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం



రెస్టారెంట్‌లో కాలిపోయిన సామగ్రిని బయటకు తెస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెస్టారెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి టీసీఎస్ సమీపంలోని ద ఫుడ్ ట్రెస్ రెస్టారెంట్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం 7గంటల సమయంలో లోపలి నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు యజమాని అఖిల్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఆయన రెస్టారెంట్‌లో పనిచేసే సిబ్బందిని పంపించారు. తలుపులు తీసి చూడగా కౌంటర్ వద్ద మంటలు ఎగిసిపడుతున్నాయి. పొగ పూర్తిగా కమ్మేయడంతో మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఫైర్ అధికారులకు ఫోన్ చేయగా.. వచ్చి మంటలు ఆర్పారు. కౌంటర్, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని యజమానులు వాసుదేవ్, అఖిల్‌లు తెలిపారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

తెలుగు జాతి గర్వించదగిన నేత ఎన్టీఆర్

షాద్‌నగర్: దివంగత నేత ఎన్టీఆర్ తెలుగు జాతి గర్వించదగిన వ్యక్తి అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. ఎన్టీఆర్ పేరిట కేంద్ర ప్రభుత్వం వంద రూపాయల నాణేన్ని విడుదల చేసిన సందర్భంగా.. పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బీవీరావు నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు పినబాక ప్రభాకర్, శ్రీను, రమేశ్, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నర్సింహులు

60 అడుగుల ఎత్తులో భారీ జాతీయ జెండా

ఆవిష్కరించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



భారీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని తట్టిఅన్నారం ఇందూ అరణ్య కాలనీలో మాజీ కౌన్సిలర్ మునగాల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 60 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన భారీ జెండాను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత జాతీయ సమగ్రతకు, సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలిచే భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని, దేశ భక్తిని పెంపొందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

26 మందిపై క్రిమినల్ కేసులు

సాక్షి,సిటీబ్యూరో: అక్రమ నల్లా కనెక్షన్ దారులపై జలమండలి విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకున్నారు. జలమండలి సరఫరా చేస్తున్న పైపులైన్ నుంచి అక్రమంగా నల్లా కనెక్షన్ పొందిన 26 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పీర్జాదిగూడ సెక్షన్ పరిధిలోని సుమతి టవర్స్ అపార్ట్‌మెంట్ లో నివాసముంటున్న నర్సింగ్ రావుతో పాటు మరో 26 మంది అధికారుల అనుమతి లేకుండా రెండు 25 ఎంఎం, ఒక 20 ఎంఎం పరిమాణం గల పైప్ లైన్ కనెక్షన్లు తీసుకుని నీటిని వినియోగిస్తున్నట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీలో బయట పడింది. వారిపై మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారుల అనుమతులు లేకుండా అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకుంటే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.అక్రమ నల్లా కనెక్షన్లు గుర్తించినా, డొమెస్టిక్ కనెక్షన్ తీసుకుని కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే జలమండలి విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

అదృశ్యం.. విషాదం

- మతిస్థిమితం లేని బాలిక.. నాలుగు రోజుల క్రితం మిస్సింగ్
- మురుగు కాల్వలో మృతదేహం లభ్యం
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: నాలుగు రోజుల క్రితం అనుమానాస్పదస్థితిలో అదృశ్యమైన మతిస్థిమితం లేని పదేళ్ల బాలిక మురుగు కాల్వలో శవమై కనిపించింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం తీవ్ర కలకలం రేపింది. అత్యాచారం చేసి హత్యా చేశారా? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ఇందిరానగర్ కాలనీలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఫ్యాక్టరీల నుంచి వెదజల్లే వ్యర్థాలు పారే కాల్వలో కుళ్లిన స్థితిలో బాలిక మృతదేహం పడి ఉందంటూ స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పరిసర పీఎస్‌ల పరిధిలో మిస్సింగ్ కేసులపై ఆరా తీయగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పరిధిలో పదేళ్ల బాలిక అంకిత అదృశ్యమైనట్లు తెలుసుకున్నారు. ఇందిరానగర్ కాలనీలో లభ్యమైన బాలిక మృతదేహం అంకితదేనని గుర్తించారు. గగన్‌పహాడ్ ఇందిరా సొసైటీకి చెందిన గడ్డమీది నరసింహ, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. రెండో సంతానం అంకితకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటలకు కుటుంబ సభ్యులు పడుకొని ఉండగా.. బాలిక ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు చుట్టపక్కల వెతికారు. అనంతరం 100కు డయల్ చేసి ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అనంతరం స్థానికంగా సీసీ కెమెరాలు పరిశీలించగా.. శుక్రవారం మధ్యాహ్నం 2.41 గంటలకు బాలిక రోడ్డుపై ఒంటరిగా వెళ్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉండగానే బాలిక మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారా? లేక ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి

- మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి
- కాంగ్రెస్ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ విజయానికి సమష్టిగా పనిచేయాలని ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాంనుంతల సమీపంలోని డీఎంకే ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ బూత్‌లెవల్ ఏజెంట్ల శిక్షణ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్‌తో హాజరైన వంశీచంద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ నాయకులు గుడురు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, మండ్లి రాములు, మోహన్‌రెడ్డి, బిచ్యానాయక్, మోతీలాల్‌నాయక్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు కలిసిన.. పెట్రోల్ విక్రయం!

- బంక్ ఎదుట వాహనదారుల ఆందోళన
- శాంపిల్స్ సేకరించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు



పెట్రోల్‌ను కల్తీ చేసారని చూపెడుతున్న వాహనదారుడు

ఇబ్రహీంపట్నం: నీళ్లు కలిసిన పెట్రోల్ విక్రయిస్తూ మోసం చేస్తున్నారని వాహనదారులు మండిపడ్డారు. ఈ మేరకు సదరు బంకు ఎదుట సోమవారం సాయంత్రం ఆందోళ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శేరిగూడ సమీపంలోని పవన్ పెట్రోలియం పోర్ట్ (హెచ్‌పీ పెట్రోల్ బంకు)లో ఇంధనం పోయించుకుని వెళ్తున్న సుమారు 20 బైకులు రెండుమూడు కిలోమీటర్ల దూరం వెళ్లగానే ఆగిపోయాయి. ఒకరి ద్వారా ఒకరు విషయం తెలుసుకున్న వాహనదారులు వెనుదిరిగి వచ్చి బంకు ముందు ఆందోళనకు దిగారు. అయితే పెట్రోల్ కల్తీ కాలేదని, సరిగ్గా మిక్స్ కాకుండానే ఇక్కడికి తెచ్చి డంప్ చేయడంతో ఈ సమస్య ఎదురైందని సిబ్బంది చెప్పారు. మెకానిక్‌ను పిలిపించి బైక్‌లలోని పెట్రోల్ తీసేసి, మళ్లీ పోశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులకు సర్ది చెప్పారు. అనంతరం తూనికలు, కొలతల అధికారులు వచ్చి శాంపిల్స్ సేకరించారు. అన్నిరకాల తనిఖీలు పూర్తయ్యే వరకూ బంక్‌ను మూసేయాలని ఆదేశించారు.

ఉద్యోగిపై దాడి.. ఆభరణాల దోపిడీ

పోలీసుల అదుపులో నిందితులు

చిలకలగూడ : క్యాబ్ కోసం ఎదురుచూస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, ఒంటిపై ఉన్న బంగారు నగలు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చిలకలగూడ సీఐ మట్టంరాజు, డీఐ శ్రీశైలంనాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన సంపత్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన శుభకార్యానికి హాజరైన అతను ఇంటికి తిరిగి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకున్నాడు. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై నిలబడి క్యాబ్ కోసం ఎదురుచూస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు నగదు ఇస్తాం గూగుల్ పే లేదా ఫోన్ పే చేయమన్నారు. తన అకౌంట్‌లో క్యాష్ లేదని చెప్పడంతో హఠాత్తుగా ముగ్గురు కలిసి అతడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సంపత్‌కుమార్ చేతిలోని సెల్‌ఫోన్, మెడలోని బంగారు గొలుసు, చేతికి ఉన్న వాచీ, ఉంగరాలు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. శుభకార్యానికి వచ్చిన మరికొందరు రక్తపుగాయాలతో పడిఉన్న సంపత్‌కుమార్‌ను గమనించి 108తోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంపత్‌కుమార్‌ను గాంధీఆస్పత్రికి తరలించారు. కోలుకున్న అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు నిందితుల వాహనం నంబర్ ఆధారంగా వారిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చిలకలగూడ సీఐ తెలిపారు.